# ఆహ్లాదం ఆరోగ్యం ఆనందం

### నాడు

ప్రజారోగ్యాన్ని పట్టించుకోలేదు. నివాస ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు నిరుపయోగంగా ఉన్నా వాటిని పట్టించుకోలేదు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉండేవి. దీంతో వ్యాయామం చేయాలంటే ప్రైవేటు జిమ్‌లకు వెళ్లాల్సి వచ్చేది. నెలా నెలా వందలాది రూపాయలు ఫీజు చెల్లించుకోవాల్సి వచ్చేది. ప్రైవేటు జిమ్‌ల్లో ఫీజులు చెల్లించుకోలేక పేదలు, మధ్య తరగతి వాళ్లకు వ్యాయామం చేసే భాగ్యం ఉండేది కాదు.

### నేడు

వ్యాయామం చేయాలంటే ఎక్కడెక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు.ప్రజారోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం జీవీఎంసీ ఆధ్వర్యంలో విస్తృతంగా ఓపెన్ పార్కులు ఏర్పాటు చేసింది. పార్కుల్లో ప్రత్యేకంగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుతో చిన్నారులు, పెద్దవాళ్లు అనే తేడా లేకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యాన్ని పదిలం చేసుకుంటున్నారు.

- ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం
- పార్కులు, గ్రీన్ బెల్ట్‌ల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- సంతోషం వ్యక్తం చేస్తున్న వాకర్స్


వ్యాయామం చేస్తున్న ప్రజలు


మర్రిపాలెం గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు


ఇది కదా అభివృద్ధి

విశాఖ విద్య/ మల్కాపురం: ఉరుకుల పరుగుల జీవితంలో విశ్రాంతి దొరకడం లేదు. ఫలితంగా మానసిక ఒత్తిడికి లోనయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అనారోగ్యానికి కారణమవుతున్నాయి. మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి వ్యాయామం తప్పనిసరి అని వైద్యులు, మానసిక నిపుణులు సూచించడంతో వ్యాయామంపై మక్కువ చూపుతున్నారు. ప్రైవేటు జిమ్‌లకు వెళ్లాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకోవడంతో కొంతమంది వాటి వైపు చూడలేకపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు ఉచితంగా వ్యాయామం చేసుకునేందుకు చర్యలు చేపట్టింది. వారి అవసరాలకు తగిన విధంగా పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. ఈ జిమ్‌ల్లో జనం ఉదయం, సాయంత్రం ఉత్సాహంగా వ్యాయామం చేసుకుంటున్నారు. అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందుతున్నారు.

- జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత మహిళలు,యువత,విద్యార్థులు, పెద్దలు జిమ్‌లోని పరికరాలతో వ్యాయామం చేస్తున్నారు.దీంతో తమకు ఆనందంతో పాటు ఆరోగ్యం సొంతమవుతుందని ఇక్కడకు వచ్చే వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వాకర్స్ పార్కులో జీవీఎంసీ అధికారులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. నిత్యం ఈ పార్కుకు వందలాది మంది వరకు వాకర్స్ వస్తుంటారు.వారంతా గతంలో ఇంటి వద్ద వ్యాయామం చేసుకునే వారు. ఇప్పుడు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పచ్చటి చెట్ల నడుమ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఉండటంతో వాకర్స్ ఎంతో ఆహ్లాదం పొందుతున్నారు.
- హాయి గొలిపేలా ఎన్‌ఏడీ కూడలి నుంచి మర్రిపాలెం వరకు గ్రీన్ బెల్ట్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. 52వ వార్డు నవాంధ్ర స్కూల్ ఎదుట మోడ్రన్ గ్రీన్‌బెల్ట్‌ను మరింత అభివృద్ధి చేసేలా రూ.48.50 లక్షలతో పనులకు ప్రతిపాదనలు చేశారు. 52వ వార్డు కరాస, శాంతినగర్, వాసవి టవర్స్ పార్కుల్లో మోడ్రన్ లైటింగ్ నిమిత్తం రూ.41.40 లక్షలతో పనులు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

### అన్ని వర్గాలకు మేలు చేయాలనే..



పార్కులు, గ్రీన్ బెల్ట్‌లు అభివృద్ధి చేసి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశాం. పిల్లలు, పెద్దలు అందరికీ ఉపయోగపడేలా అనువైన పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. వీటిని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం. మోడల్ లైటింగ్‌తో పాటు, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

### పిల్లల కోసం పరికరాలు



మా ప్రాంతంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. సెలవు దినంలో ఇక్కడే తన స్నేహితులతో కలిసి వ్యాయామం చేసుకుంటూ సరదాగా గడుపుతున్నాం. చిన్న పిల్లల కోసం కూడా పరికరాలు ఏర్పాటు చేశారు.

– దినేష్‌రెడ్డి, పిలకవానిపాలెం

### ఆహ్లాదకర వాతావరణం



గుల్లలపాలెం వుడాకాలనీలోని వాకర్స్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం వల్ల తమ లాంటి వారికి ఎంతో ఉపయోకరంగా ఉంది. వాకింగ్ చేసిన చోట వ్యాయామం కూడా చేసుకుంటున్నాం. పచ్చటి వాతావరణం నడుమ జిమ్ ఏర్పాటు చేయడంతో ఆహ్లాదకర వాతావరణం ఉంది. గతంలో ప్రైవేటు జిమ్‌లకు వెళ్లాల్సి వచ్చేది.

– చైతన్య, శ్రీహరిపురం


చిన్నారుల కోసం..

### సౌకర్యంగా ఉంది



గ్రీన్‌బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్‌లతో పాటు వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. కోవిడ్ తర్వాత పిల్లలు, పెద్దలు వ్యాయామానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయటం వల్ల ఉపయోగకరంగా ఉన్నాయి.

–కె. నాగేశ్వరరావు, వుడా లే అవుట్ క్లబ్ అధ్యక్షుడు

| వార్డు | ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసిన ప్రాంతం | నిధులు |
|---|---|---|
| 58 | ఎదురువానిపాలెం | రూ.5.లక్షలు |
| 58 | పిలకవానిపాలెం | రూ. 5.లక్షలు |
| 59 | ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ | రూ. 5.లక్షలు |
| 60 | గుల్లలపాలెం వాకింగ్‌పార్కు | రూ.5.లక్షలు |
| 60 | ఇందిరాకాలనీ వాకింగ్‌పార్కు | రూ.5.లక్షలు |
| 52 | వుడా లే అవుట్ పార్కు | రూ.19.90 లక్షలు |
| | మర్రిపాలెం శివశివానీ స్కూల్ దరి | రూ.10.60 లక్షలు |
| | అపర్ణ అపార్ట్‌మెంట్స్ గ్రీన్ బెల్ట్ | రూ.10 లక్షలు |
| | జిందాల్ బిల్డింగ్ గ్రీన్ బెల్ట్ | రూ.19.90 లక్షలు |
| | శాంతినగర్ పార్కు | రూ.15 లక్షలు |
| | ఓల్డ్ కరాసా పార్కు | రూ.15 లక్షలు |


60వ వార్డు గుల్లలపాలెం ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న చిన్నారులు

## క్లుప్తంగా

### వేడుకగా సామూహిక కుంకుమ పూజ


కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లో గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ప్రత్యేకంగా సిద్ధం చేసిన వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తులను ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహిచిన అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

### ముగిసిన క్రీడా పోటీలు


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం: కోరమాండల్ క్రీడా మైదానంలో పారిశ్రామిక ప్రాంతంలోని 18 గ్రామాల యువతకు ఇంటర్ విలేజ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. 196 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఇంటర్ విలేజ్ క్రికెట్ పోటీల్లో 58వ వార్డు పిలకవానిపాలెం గ్రామానికి చెందిన జట్టు, ఎదురవానిపాలెం జట్ల మధ్య మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఎదురవానిపాలెం జట్టు విజేతగా నిలిచింది. దీంతో ఆ జట్టుకు కోరమాండల్ సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జీఎస్‌వీ రాజు ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో కోరమాండల్ అధికారులు శ్రీకాంత్, సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్ ) పిల్లా నారాయణపాత్రుడు పాల్గొన్నారు.

### సాంస్కృతిక కార్యక్రమాలతో వ్యక్తిత్వ వికాసం


ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

మల్కాపురం: సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వ్యక్తిత్వ వికాసం లభిస్తుందని మల్కాపురం సెయింట్ ఆన్స్ నార్తరన్ ప్రావెన్షియల్ సుపీరియర్ సాంధ్రినా అన్నారు. సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఆవరణలో మంగళవారం నృత్య మేళా నిర్వహించారు. ఆమె తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంధ్రినా మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు ఆట పాటలకు ప్రాధ్యాన్యత ఇవ్వాలన్నారు. చదువు విజ్ఞానం అందిస్తే, సాంస్కృతిక కార్యక్రమాలు ఆనందం, ఆరోగ్యాన్ని అందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఆటోలో బంగారు ఆభరణాల చోరీ

పెందుర్తి: ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి నుంచి ముగ్గురు మహిళలు బంగారం చోరీ చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పెందుర్తి క్రైం ఎస్‌ఐ సల్మాన్ బేగ్ తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురం పోర్టుకాలనీలో నివాసం ఉంటున్న గంటా రవికుమార్ కొద్దిరోజుల కిందట కుటుంబంతో కలిసి ఊరు వెళ్లారు. సోమవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి వేపగుంట వద్ద ఆటో ఎక్కాడు. అదే సమయంలో మరో ముగ్గురు మహిళలు అదే ఆటో ఎక్కారు. ఆ మహిళలు చీమలాపల్లి వద్ద దిగిపోయారు. అయితే రవికుమార్ లక్ష్మీపురం వద్ద దిగేందుకు బ్యాగ్ చూసుకోగా జిప్ తీసి ఉన్నాయి. అందులోని ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పెందుర్తి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## మెగా జాబ్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోండి

**వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి**


జాబ్ మేళా గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్ కుమార్, జియ్యాని శ్రీధర్ తదితరులు

గోపాలపట్నం: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో డిసెంబర్ 1,2 తేదీల్లో నిర్వహించనున్న మెగా జాబ్ ఫెయిర్‌ను పశ్చిమ నియోజకవర్గ యువత సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో మంగళవారం ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా గోడపత్రికను సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో యువత కోసం ఆనంద్ కుమార్ మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాల కోసం ఆనంద్ కుమార్ పని చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు పశ్చిమ నియోజకవర్గానికి వరంలా ఆనంద్‌కుమార్ వచ్చాడని అభినందించారు. ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ జింక్ హనుమాన్ ఆలయ సమీపంలోని పాత ఆండాళ్ల కళాశాల, ఆల్వార్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. మేళాలో సుమారు 75 కపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. తొలుత 50 కంపెనీలు పాల్గొంటాయని భావించామని అనూహ్యంగా మరో పాతిక కంపెనీలు ఆసక్తి చూపించాయన్నారు. నిరుద్యోగ యువతకు మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. జాబ్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ధ్రువపత్రాలతో డిసెంబర్ 1న ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకోసం 9000818467, 9000938467 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

**యాప్ ద్వారా ఉద్యోగావకాశాలు...**

మీతో ఆనంద్ యాప్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఇది గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వ్యాసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, పుర్రె సురేష్, కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, ముర్రు వాణి, క్లస్టర్ అధ్యక్షులు అంగా రాంప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితాపై ప్రత్యేక శ్రద్ధ

**ఆర్డీవో హుస్సేన్ సాహెబ్**


మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సూచించారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమన్నారు. నూతన ఓటర్ల నమోదు, జాబితాలో చేర్పులు, మార్పుల విషయంలో అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకే వ్యక్తి ఓటు హక్కు కోసం ఎక్కువ దరఖాస్తులు సమర్పిస్తే అలాంటి వాటిని పరిగణలోకి తీసుకోవద్దన్నారు. ఒక చోట నుంచి మరో చోటకు ఓటు మార్చుకునే వారి నుంచి తప్పనిసరిగా డిక్లరేషన్ తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో జీవీఎంసీ 5,8వ జోనల్ కమిషనర్లు కృష్ణ, మల్లయ్యనాయుడు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కావాలంటే జగనన్నే రావాలి

**జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా**


ప్రభుత్వ పథకాల బ్యానర్ ఆవిష్కరిస్తున్న బెహరా


అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్న బద్రీనాథ్

గోపాలపట్నం: రాష్ట్రం అభివృద్ధి కావాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యంత్రిగా రావాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. జీవీఎంసీ 91వ వార్డు 482 సచివాలయం పరిధి లక్ష్మీనగర్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో మంజూరైన ప్రభుత్వ పథకాలు వివరాల బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భాస్కరరావు మాట్లాడుతూ సంక్షేమం. అభివృద్ధిని సమానంగా తీసుకెళ్లిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. సచివాలయంలో వివిధ పథకాల ద్వారా రూ17.70 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీరామ్, వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, సీవో యూనీస్ పాల్గొన్నారు.

సింథియా: విద్య, వైద్య, వ్యవసాయ రంగాలు బాగుంటేనే పేద కుటుంబాలకు మంచి జరుగుతుందని నమ్మి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు, నాయకులు పూండీ మల్లేష్, కొటాన రవి పాల్గొన్నారు.

## ఉక్కు ఉద్యమం భవిష్యత్ తరానికి స్ఫూర్తి


రిలే దీక్షలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భవిష్యత్ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1020వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు కూర్చొన్నారు. కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాటం ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని.. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటం చేయకతప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తించాలన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ.. దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

## పూలే ఆశయాలు నేటి సమాజానికి ఆదర్శం


అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఐటీయూ నాయకులు


జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఓబీసీ ఉద్యోగులు


పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీధర్, కృష్ణ

సింథియా: సమాజంలో రుగ్మతలను గుర్తించి, వాటికి తనదైన శైలిలో పరిష్కారం చూపిన మహాత్మా జ్యోతిరావుపూలే ఆలోచనలు, ఆశయాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని సీఐటీయూ ప్రధానకార్యదర్శి ప్రసాద్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా షిప్‌యార్డు మెయిన్‌గేటు వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతకు, వారి అభ్యున్నతికి విద్య ఒక్కటే మార్గమని ఆచరణలో చూపిన మహాత్ముడు పూలే అని కొనియాడారు.

**ఓబీసీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో.....**

హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ మెయిన్ గేటు వద్ద ఓబీసీ లైజనింగ్ ఆఫీసర్ సదాశివన్, హెచ్‌ఆర్ రాజేంద్ర, జీఎంహెచ్‌ఆర్ కోటేశ్వరరావు తదితరులు జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాఖ విద్య: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణతో కలసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. పూలే మార్గదర్శకాలను అనుసరిస్తూ సమాజాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు.

## 23 ఆటోలపై కేసుల నమోదు


డ్రైవర్లకు రహదారి భద్యతపై అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారి

గోపాలపట్నం: స్కూల్ ఆటోలపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. కొమ్మాది, ఎండాడ, ఉప్పాడ ప్రాంతాల్లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో నిబంధనలు పాటించని 23 ఆటోలు, ఓ స్కూల్ బస్సుపై కేసులు నమోదు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో 130 ఆటోలపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. అలాగే పలు ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. స్కూల్ ఆటోల్లో అధిక శాతం మంది పిల్లలు ఉంటున్నారని, ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఎంవీఐలు ఐ.వేణుగోపాలరావు, బాలాజీరావు, రాజారావు, శిరీష, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.